క్లుప్తంగా

పంటల నమోదు పక్కాగా జరగాలి



బాల్కొండ : పంటల నమోదు పక్కాగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్ అన్నారు. శనివారం ముప్కాల్ మండలంలోని కొత్తపల్లిలో పంటల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నమోదులో తప్పులు ఉండరాదన్నారు. వ్యవసాయ అధికా రి రాజు కుమార్, ఏఈవోలు ఉన్నారు.

కొనసాగుతున్న లింగమయ్య ఉత్సవాలు



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో స్వయంబులింగమేశ్వరుడుగా ప్రసిద్ధి చెందిన లిగమయ్య ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉగాది పర్వదినం నుంచి ఉత్సవాలు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి రోజు అన్నదానం, ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. ఆదివారం చివరి రోజు ఉత్సవాలు ముగుస్తాయని పండితుడు గణేశ్ తెలిపారు.

ఇటుక బట్టీలతో ఇబ్బంది

రుద్రూర్ : రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్, కొందాపూర్ శివారులో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని కొందాపూర్ గ్రామస్తులు శనివారం తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మొరం తవ్వకాలు జరిపిఇటుక బట్టీలు ఏర్పాటు చేసి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. శ్రీ బసవేశ్వర మందిరం, అలీబాబా దర్గాకు చెందిన భూమలు కబ్జాకు గురైతున్నందున సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకోవాలని పిర్యాదులో పేర్కొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్ కిడ్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్ తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో పాఠశాలకు చెందిన నిహారిక, మనోజ్ఞ, వర్షిని, అక్షర, శారిక్, భావిత్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. దీంతో జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ లత, అబాకస్ ఉపాధ్యాయినిలు శ్రీలేఖ, రజిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



మాక్లూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. శనివారం మండలంలోని మాణిక్‌భండార్ వద్ద గల కాకతీయ మహిళ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన క్రీడల ముగింపు కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రిన్సిపాల్ సెల్వ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సాయిరెడ్డి, మహేందర్, నాగరాణి, మహిపాల్, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌ను జిల్లాగా ప్రకటించాల్సిందే..

బోధన్ : బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లాను వెంటనే ప్రకటించాలని న్యాయవాది యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బానోత్ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తోందన్నారు. రిలే నిరాహార దీక్ష లు శనివారం నాటికి 97వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, శంకర్, శేఖర్‌లు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాదులు సీహెచ్ వీ హన్మంత్‌రావు, అర్జున్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

రుద్రూర్ : బాలల హక్కులను పరిరక్షించే బాధ్యత అందరిదని బోధన్ సీడీపీవో జానకి అన్నారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. పోషణ పక్వాడలోభాగంగా కిషోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లు మణి,సుమలత, ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సుజాత తదితరులున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

- జీపీలకు అవార్డులు అందజేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి



మంత్రి చేతుల మీదుగా ఉత్తమ జీపీ అవార్డు అందుకుంటున్న వేల్పూర్ జీపీ పాలకవర్గం



వల్లభాపూర్ సర్పంచ్ మంజులకు అవార్డు అందజేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్, జెడ్పీ చైర్మన్

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్ర పంచాయతీకి జాతీయ అవార్డు లభించింది. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం కింద జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేశారు. స్వయం సమృద్ధి, మౌళిక సదుపాయాలు కేటగిరిలో కమ్మర్‌పల్లికి పురస్కారానికి ఎంపికైంది. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ స్వామి, కార్యదర్శి శాంతికుమార్ అవార్డును అందుకున్నారు. హాసాకొత్తూర్ జీపీ సుపరిపాలన కేటగిరిలో జాతీయ పురస్కారానికి ఎంపికకాగా, మంత్రి, కలెక్టర్, జెడ్పీ చైర్మన్ అవార్డును అందజేశారు.

వేల్పూర్ జీపీ..

వేల్పూర్ : వేల్పూర్ జీపీ స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు విభాగంలో జిల్లా ఉత్తమ జీపీ అవార్డు వరించింది. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా వేల్పూర్ జీపీ పాలకవర్గం అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమ జమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, సర్పంచ్ తీగెల రాధ, ఉపసర్పంచ్ పిట్లసత్యం తదితరులు పాల్గొన్నారు.

వల్లభాపూర్..

మాక్లూర్ : ఉత్తమ జీపీగా ఎన్నికైన సందర్భాన్ని పురష్కరించుకోని శనివారం వల్లభాపూర్ సర్పంచ్ శిలారి మంజుల సుధాకర్‌కు జిల్లా కేంద్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ హన్మంత్‌లు ఉత్తమ గ్రామ పంచాయితీ అవార్డును అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన 27 గ్రామ పంచాయతీల్లో వల్లభాపూ ర్ మొదటి పంచాయతీగా ఎంపికైంది. నీరు పుష్కలంగా ఉన్న జీపీగా ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆకుల లలిత, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో



అవార్డు అందుకుంటున్న ఆలూర్ జీపీ పాలకవర్గం

క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, ఉపసర్పంచ్ గంగాధర్, కార్యదర్శి రమేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య పంచాయతీగా దేగాం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం గ్రామ పంచాయతీ జిల్లా స్థాయిలో ఉత్తమ హెల్తీ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్‌లో శనివారం నిర్వహించిన జాతీయ అవార్డుల కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దేగాం సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డికి అవార్డును అందజేశారు.

చిరు ధాన్యాలను విరివిగా వాడాలి



బహుమతులను అందజేస్తున్న సీడీపీవో భార్గవి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు చిరు ధాన్యాలను ప్రతిరోజు ఆహారంలో భాగంగా చేసుకోవాలని సీడీపీవో భార్గవి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని పోషణ పక్షంలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మహిళల్లో కౌమార దశ నుంచి రక్తహీనతను తగ్గించడానికి ప్రధాని నరేంద్ర మోడి 2018 మార్చి 8వ తేదీనా మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజస్థాన్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో జ్యోతి, సూపర్ వైజర్ శ్రీదేవి, టీఎన్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షురాలు తారా, అంగన్వాడీ టీచర్లు సునీత, చిత్ర, సావిత్రి, సరిత, సుమలత, వహీద, లింగమణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన

రుద్రూర్ : తృణధాన్యాలతో చేసిన ఆరోగ్యం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రక్తహీనత రాకుండా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. చందూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామంలో శనివారం కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత , పద్మ, చిన్నారులకు తల్లులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు. మోస్రాలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.

క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు



బహుమతులు అందజేస్తున్న వైద్యాధికారిణి ఆయేషా



రుద్రూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రుద్రూర్ : రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారిణి ఆయేషా సిద్ధికా మాట్లాడుతూ క్షయ ఉన్నట్లయితే ఉచితంగా మందులతో పాటు పోషకాహారం కోసం నెలకు రూ.500 చొప్పున ఆర్నెళ్ల వరకు అందిస్తారన్నారు. క్షయ వ్యాధి చికిత్స పొంది పూర్తిగా నయమైన వారిని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సన్మానించారు. హైస్కూల్ హెడ్‌మాస్టర్ రాజ్‌మంజూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్లు రవి, సావిత్రి, డివిజనల్ క్షయ సూజర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే రాహుల్‌పై అనర్హత వేటు



బోధన్ : నరేంద్రమోదీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసిందని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణువర్దన్ రెడ్డి, యూత్‌కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్, నాయకులు సాయిలు, బడు, ప్రసాద్, సాయి క్రిష్ణ, ఇనాయత్ అలీ, బాలకృష్ణ పాల్గొన్నారు.

'భవిష్యత్‌కు పునాది పదో తరగతి'



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న ఎంఈవో

రెంజల్(బోధన్): చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అలాంటి చక్కని భవిష్యత్తు నిర్మించుకునేందుకు పదవ తరగతి పునాది లాంటిదని ఎంఈవో గణేశ్‌రావ్, జన వికాస స్వస్చంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు తెడ్డు పోశెట్టిలు అన్నారు. స్వస్చంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కందకుర్తి, నీలా, దూపల్లి గ్రామాల్లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష్యాప్యాడ్‌లు, పెన్నులు, వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కలీంబేగ్, సాయరెడ్డి, పీఆర్టీయు మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాఘవేందర్, విండో చైర్మెన్ ఇమాంబేగ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న అధికారి వెంకటేశ్

రెంజల్(బోధన్): లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై రెంజల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మండలంలోని ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ, ఆశలు, ఐకేపి సిబ్బందికి అవగాహన నిర్వహించా రు. జిల్లా ఆరోగ్య బోధకుడు వెంకటేష్, మండల వైద్యాధికారి వినయ్‌కుమార్‌లు మాట్లాడుతూ జిల్లాలోని ఐదు మండలాల్లో 1000 మంది బాలురకు 900 నుండి 918 మంది బాలికల నిష్పత్తి ఉందని వివరించారు. అబార్షన్లపై గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లింగనిర్ధారణ నేరమన్నారు. సర్పంచ్ మర్ల రమేష్, డాక్టర్ ప్రమోదిత, ఆరోగ్య విస్తరణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

'మానవ జన్మ ఎంతో శ్రేష్టమైనది'

రుద్రూర్ : మానవజన్మ ఎంతో శ్రేష్టమైనదని, చిన్నప్పటి నుండే భక్తి భావన అలవర్చుకోవాలని బిచ్కుంద పీఠాధిపతి సద్గురు సోమలింగ శివచార్య స్వామి, హనుమాన్ దీక్ష గురు స్వామి నాగభూషణం అన్నారు. పోతంగల్ మండలం సోంపూర్ గ్రామంలో శనివారం బోధన్ డివిజన్ అఖిలభారత హనుమాన్ దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష స్వాములకు మండల భిక్ష నిర్వహించారు. కందారే అనిత దిగంబర్ భిక్ష దాతలుగా నిలిచారు.

వంటిల్లే ఆరోగ్యశాల

రుద్రూర్ : వంటిల్లే ఆరోగ్యశాల అని, వంటిల్లును ఆయుర్వేద శాస్తంగా తీర్చిదిద్దాలని పతాంజలి యోగ సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంజుశ్రీ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో శనివారం పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యజ్ఞం, యోగ, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం నిర్వహించారు. వంటింట్లో పసుపు, అల్లం, మిరియాలు, యాలకులు వంటి వాటిల్లో ఎన్నో ఆరోగ్య లక్షణాలున్నాయన్నారు. ఎంపీపీ అక్కపల్లి సుజాత, జిల్లా పతంజలి మహిళ అధ్యక్షురాలు సునీత, నర్మద, కౌసల్య, రుద్రూర్ మహిళా ప్రభారి జ్యోతి, భవాని ఉన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురికావొద్దు



ప్రశ్నాపత్రాన్ని అందిస్తున్న ఏసీపీ కిరణ్ కుమార్

బోధన్ : పోలీసు ఉద్యోగ అర్హత పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు.పరీక్షా సమయంలో ఏలాంటి మానసిక ఒత్తిళ్లకు గురి కావద్దన్నారు. పట్టుదల ఉంటే సంకల్పించిన లక్ష్యం నెరవేరుతోందని పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో టౌన్ సిఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగ అర్హత పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థులకు మోడల్ రాత పరీక్షను నిర్వహించారు. అభ్యర్థులకు ఏసీపీ ప్రశ్నపత్రాలను అందించారు. టౌన్, రూరల్ సిఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రాజు, ఎస్సైలు సందీప్, పీటర్, ఏఎస్సైలు గంగాప్రసాద్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పోషణ పక్షంపై శిక్షణ

సిరికొండ : మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు పోషణ పక్షం కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ సమావేశం శనివారం నిర్వహించారు. భీంగల్ ఏసీడీపీవో స్వర్ణలత మాట్లాడుతు వచ్చే నెల 4వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఏఏ కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో వివరించారు. చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో సూపర్‌వైజర్లు ప్రియదర్శిని, విజయరాణి, 71 మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రాజెక్టులతో సృజనాత్మకత పెరుగుతుంది'



పెర్కిట్(ఆర్మూర్): పాఠశాలల్లో సైన్సు ప్రాజెక్టులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎంఈవో రాజ గంగారం అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో శనివారం స్కూల్ లీడ్ కాన్ఫరెన్సు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో రాజ గంగారం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించి సైన్స్ ప్రాజెక్టులను ఎంఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ దాసు, టీఎన్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షురాలు తారా, రిటైర్డు హెచ్‌ఎం మద్దికుంట నవజీవన్, అరవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..



విద్యుత్ వైర్ల కింద పెరుగుతున్న హరితహారం చెట్లు

నాటుతున్నారు..నరుకుతున్నారు..

అధికారులు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు హరితహారం మొక్కలను మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో అవగాహన లేకుండా రహదారుల వెంబడి విద్యుత్ వైర్లకు కిందే నాటారు. ప్రస్తుతం అవి పెరిగి విద్యుత్ వైర్లను తాకుతుండటంతో విద్యుత్ సిబ్బంది వాటిని నరికి వేస్తున్నారు. దీంతో హరితహారం లక్ష్యానికి గండిపడుతోంది. –మాక్లూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: జె. క్రాంతి, ఎంపీడీవో

ఫోన్ నంబర్ : 98499 00108

సింగంపల్లి తండాలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి సరిత

మాక్లూర్ : మండలంలోని సింగంపల్లి తాండలో శనివారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సరిత ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. నిజామాబాద్ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొనగా, సర్పంచ్ గంగాధర్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులు, అవగాహన కల్పించాల్సి న అంశాలను ప్రోగ్రాం అధికారికి వివరించారు. అలాగే మండలంలోని అడవి మామిడిపల్లిలో సీఎస్ఐ డిగ్రీ కళాశాల విద్యార్థులచే కొనసాగునతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా చెట్లను నరకడం, మాయమవుతున్న అడవుల వల్ల కల్గే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింత మల్లారెడ్డి, ప్రోగ్రాం అధికారి గంగాధర్, ఫారెస్టు రెంజ్ అధికారి సౌమ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను అడ్డుకోవాలి'



ఆర్మూర్‌టౌన్ : బస్తీ స్థాయిలో బాలల రక్షణ కమిటి సభ్యులు వార్డులలో బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 33వ వార్డులో బస్తీ స్థాయిలో బాలల రక్షణ కమిటి అంగన్‌వాడిటీచర్‌లు, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసందర్బంగా చైర్‌పర్సన్ పండిత్ వినీత మాట్లాడుతూ పిల్లలు బడి మానకుండా చూడాలన్నారు. బస్తీ కమిటీ పిల్లల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, ఆర్పీసత్య తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని రెండ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బాలల భద్రతపై తీసుకోవాల్సిన చర్యలుపై స్థానిక కౌన్సిలర్ ఖాందేష్ సంగీత వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు శోభ, సవిత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జానకంపేటలో హనుమాన్ శోభాయాత్ర

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలో హనుమాన్ స్వాములు మండల భిక్ష సందర్బంగా హనుమాన్ స్వాములు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఎంపీటీసీ మంద సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



జానకంపేటలో నృత్యాలు చేస్తున్న హనుమాన్ స్వాములు

నాలుగు దుకాణాలకు తాళాలు



దుకాణానికి తాళాలు వేస్తున్న బల్దియా సిబ్బంది

బోధన్ : ఆస్తి పన్ను బకాయిల వసూళ్ల కోసం మున్సిపల్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాకు సమీపంలో ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న నాలుగు వ్యాపార దుకాణాల షెట్టర్లకు అధికారులు తాళాలు వేశారు. వీటికి సంబంధించి ఆస్తిపన్ను బకాయిలు సుమారు రూ. 10 లక్షల వరకు ఉంటాయన్నారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ నరేందర్‌తో పాటు బిల్లు కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. బోధన్ మున్సిపాలిటీల పరిధిలో 18,927 నివాసాలున్నాయి. రూ. 7,66,70,000 ఆస్తి పన్ను రాబడి ఉండాల్సి ఉండగా ఇప్పటిదాకా రూ.3,66,72,000వసూలయ్యాయన్నారు. మిగితా బకాయి వసూళ్ల కోసం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఏరాజ్‌పల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

బోధన్‌రూరల్(బోధన్) : మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామంలో పట్టణంకు చెందిన ఏస్వీ డిగ్రీ కళాశాల వలంటీర్లు ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. శనివారం గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ రెడ్డి, కార్యదర్శి బాలక్రిష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ రవి పటేల్, అధ్యాపకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899